క్లుప్తంగా

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో ఎమ్మెల్యే ప్రభాకర్ పూజలు

కంది(సంగారెడ్డి) : మండల పరిధిలోని కవలంపేట దుర్గాభవాని ఆలయ 7వ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మన్ బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచులు రాజేందర్ రెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు

సంగారెడ్డి టౌన్ : శ్రావణ మాసం చివరి శుక్రవారం పురస్కరించుకొని పట్టణ శివారులోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో మహిళలు సామూహిక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాలు, పండ్ల రసాలతో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం కుంకుమార్చన నిర్వహించారు. దేవాలయ కమిటీ చైర్మన్ అనంతకృష్ణ పాల్గొన్నారు.

రైతుల వివరాల సేకరణ



సంగాపూర్‌లో దరఖాస్తు స్వీకరిస్తున్న ఏఓ సారిక

రాయికోడ్(అందోల్): మండలంలోని సింగితం, రాయిపల్లి, సంగాపూర్ గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి సారిక రుణమాఫీ కాని రైతుల వివరాలను సేకరించారు. ఆయా గ్రామాల్లో రేషన్ కార్డు లేని రుణమాఫీకి అర్హులైన రైతుల వివరాలతో కూడిన దరఖాస్తులను సేకరించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రేషన్ కార్డు లేని రైతులు, కుటుంబసభ్యులను నిర్ధారణ చేసేందుకు గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరిస్తున్నామన్నారు. మూడు రోజులుగా మండలంలోని 9 గ్రామాల్లో పర్యటించి రేషన్ కార్డు లేక రుణమాఫీ కాని 148 మంది రైతుల వివరాలను సేకరించామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, ఆత్మ సిబ్బంది, రైతులు ఉన్నారు.

ప్రతిఒక్కరూ కలిసిమెలిసి ఉండాలి

మునిపల్లి(అందోల్): కులవివక్ష లేకుండా ప్రతీ ఒక్కరూ కలిసిమెలిసి ఉండాలని ఉప తహసీల్దార్ కృపాదానం అన్నారు. శుక్రవారం మండలంలోని పొల్కంపల్లి గ్రామంలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. రెండు గ్లాసుల పద్ధతి ఉన్నది లేనిది గ్రామస్తులనడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలు ప్రతీఒక్కరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి విద్యుత్‌నగర్ కాలనీ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. పాత ఎంఐజీ, విద్యుత్‌నగర్ కాలనీ, అన్నమయ్య ఎన్‌క్లేవ్, ఇందిరానగర్, తెల్లాపూర్, అంబేద్కర్‌కాలనీ, జేపీ కాలనీ, కొమరంభీం కాలనీ, హుడా, మాక్స్ సొసైటీ కాలనీ, మై ఫెయిర్ రోడ్డు, బోన్‌సాయి, ఆదిత్య, వాసదేవ్ విల్లాస్‌కు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

నియామకం



నియామకపత్రం అందుకుంటున్న పండరి

నారాయణఖేడ్: నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా ఖేడ్‌కు చెందిన వై.పండరి నియమితులయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో అఖిల భారత ఇన్‌చార్జి సర్వేందర్, రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ రహీం నియామక ఉత్తర్వుల తోపాటు గుర్తింపు కార్డును అందజేశారు. పదేళ్లుగా అంబేడ్కర్, పూలే సేవా సమితి రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా పనిచేస్తూ పండరి సామాజిక కార్యకర్తగా పేదల సమస్యల పరిష్కారం, మానవహక్కుల పరిరక్షణ కోసం చేస్తున్న కృషిని గుర్తించి నియమించినట్లు వారు వివరించారు.

రైతుల వివరాల సేకరణ

న్యాల్‌కల్(జహీరాబాద్): రుణమాఫీ కాని రైతుల నుంచి వివరాలు సేకరించే కార్యక్రమం కొనసాగుతోంది. శుక్రవారం న్యాల్‌కల్‌లోని రైతు వేదికలో ఏఓ అభినాష్ వర్మ, ఏఈఓలు సాయిలు, సాయినాథ్‌రెడ్డి, నగేష్, రమేష్, మమతలు రైతుల నుంచి పలు పత్రాలను సేకరించారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అవుతుందని ఏఓ భరోసా ఇచ్చారు.

అసాంఘిక కార్యకలాపాలకు.. అడ్డా



డబుల్‌బెడ్‌రూమ్‌లు

హన్‌మాన్‌నగర్‌లో గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టినా ప్రారంభానికి నోచలేదు. దీంతో ఇవి మందుబాబులకు అడ్డాగా మారింది. జూదరులు పేకాట ఆడుతున్నారు. తలుపులు లేకపోవడంతో యథేచ్ఛగా లోపలికి చొరబడి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఇళ్ల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి అడవిని తలపిస్తుండటం కూడా కారణమని ప్రజలు అంటున్నారు.

– సంగారెడ్డి క్రైమ్:

నిత్యం ఇలా.. ప్రయాణం ఎలా ?



అండర్ బ్రిడ్జి వద్ద నిలిచిపోయిన వాహనాలు

పట్టణ కేంద్రంలోని ఐబీ చౌరస్తా నుంచి బసవేశ్వర విగ్రహం వరకు గల బైపాస్ రోడ్డుకు ఇరువైపులా నూతన కాలనీలు ఏర్పడ్డాయి. నిత్యం వాహనదారులు అధిక మొత్తంలో ఇదే మార్గం గుండా ప్రయాణిస్తుంటారు. ఇక్కడ అండర్ బ్రిడ్జి ఇరుకుగా నిర్మించడం వల్ల నిత్యం ప్రయాణానికి ఇబ్బంది అవుతోందని వాహనదారులు వాపోతున్నారు.

– సంగారెడ్డి అర్బన్

ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలి

పటాన్‌చెరు: యువత ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. మండలంలోని రుద్రారంలో గురువారం రాత్రి ఎన్ఎంఆర్ యువసేన సభ్యుడు ప్రశాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలహారం బండి ఊరేగింపులో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేసి ఊరేగింపును ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులు నీలం మధును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ హరిప్రసాద్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ యాదయ్య, మన్నె ప్రభు, నారాయణరెడ్డి, గోపాల్, ప్రభు, సతీష్, భిక్షపతి, నాగరాజు ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



నీలం మధును సత్కరిస్తున్న యువకులు

ఆగిన పనులు.. తప్పని వెతలు

- అర్ధంతరంగా నిలిచిన ఏడీఏ భవన నిర్మాణం
- నిధుల కొరతే కారణం
- శిథిలావస్థకు చేరిన పాత భవనం
- రైతులకు తప్పని తిప్పలు
- దృష్టి సారించని అధికారులు



అసంపూర్తిగా ఏడీఏ కార్యాలయ భవన నిర్మాణం

జహీరాబాద్ టౌన్: పట్టణంలో నిర్మిస్తున్న వ్యవసాయశాఖ ఏడీఏ కార్యాలయం నిధుల కొరతతో అసంపూర్తిగా ఆగిపోయింది. మైనర్ పనులతో పాటు ప్రహరీ నిర్మిస్తే కార్యాలయం వినియోగంలోకి వస్తుంది. ప్రస్తుతం ఉన్న కార్యాలయం భవనం శిథిలావస్థకు చేరుకుంది. స్థలం కూడా ఇరుకగా ఉండడంతో అర్జీలు ఇచ్చేందుకు వచ్చే రైతులకు అవస్థలు తప్పడంలేదు.

జహీరాబాద్ పట్టణంలోని భవానీ మందిరం రోడ్డులో ఉన్న వ్యవసాయశాఖ డివిజన్ (ఏడీఏ) కార్యాలయం పాతబడింది. దశాబ్దాల క్రితం నిర్మించిన కార్యాలయం భవనం దెబ్బతిని శిథిలావస్థకు చేరుకుంది. స్థలం కూడా ఇరుకగా ఉండడంతో పనుల మీద ఇక్కడి వచ్చిన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడీఏ కార్యాలయం పక్కనే ఉన్న వ్యవసాయశాఖకు గోదాం నిరుపయోగంగా ఉందని, గోదాం స్థానంలో నూతన ఏడీఏ కార్యాలయం నిర్మించాలని బీఆర్ఎస్ నాయకులు మాజీ మంత్రి హరీశ్‌రావును కోరారు. ఈ మేరకు ఆయన రూ.40 లక్షల నిధులు మంజూరు చేసి జనవరి 2020లో ఏడీఏ కార్యాలయం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ ప్రారంభంలో పనులు శరవేగంతో చేపట్టారు. నిధులు చాలక పనులను అసంపూర్తిగా ఆపేశారు. ఇంకా రూ.10 లక్షలు వెచ్చిస్తే ఏడీఏ కార్యాలయం భవనం వినియోగంలోకి వస్తుందని కాంట్రాక్టర్ పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి మిగులు పనులకు నిధులు మంజూరి చేయాలని కోరుతున్నారు. ఇదే విషయాన్ని పంచాయతీ రాజ్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా నిధుల కొరత వల్ల పనులు ఆగిపోయాయని, నిధుల మంజూరు కోసం ఉన్నత అధికారులకు రాశామని చెప్పారు.

ఎప్పుడు కూలుతుందో..

ఏడీఏ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందో తెలియని దుస్థితి. స్థలం కూడా లేనందున కార్యాలయానికి వచ్చే రైతులు అవస్థలు పడుతున్నారు. నిధుల కొరతతో కొత్త భవనం నిరుపయోగంగా ఉంది. రూ. 10 లక్షల వరకు నిధులు మంజూరి చేస్తే భవనం వినియోగంలోకి వస్తుంది. లేదంటే రూ. 40 లక్షలతో నిర్మించిన భవనం వృథాగా ఉంటుంది.

– నామ రవికిరణ్, జహీరాబాద్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ఆర్డీఓ పాండు

జోగిపేట (అందోల్): వ్యాధులు ప్రబలకుండా ప్రతీఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అందోల్–జోగిపేట ఆర్డీఓ పాండు సూచించారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని 5, 7 వార్డుల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు నివాస ప్రాంతాల చుట్టుపక్కల మురుగు నిల్వకుండా, పిచ్చిమొక్కలు పెరగకుండా చూసుకోవాలన్నారు. గోరువెచ్చని నీటిని తాగాలని, ఆహార పదార్థాలపై ఈగలు, దోమలు వాలకుండా తగు జాగ్రత్తలు పాటించాలని రోజూ తడి, పొడి చెత్తలను వేరు చేసి ఇంటి వద్దకు వచ్చే మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని సూచించారు. ప్రజలు రోగాల బారిన పడకుండా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని మున్సిపల్ కమిషనర్ తిరుపతి అన్నారు. వార్డు ఆఫీసర్, మెప్మా ఆర్పీలకు, ఆశావర్కర్లకు సహకరించాలని సూచించారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. డీఎంహెచ్ఓ గాయత్రీదేవి, మెప్మా పీడీ గీత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినయ్ కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ పాండు

ప్రమాదాల నివారణకు బారికేడ్ల వితరణ



రోడ్డుపై బారికెడ్ ఏర్పాటు చేస్తున్న ఫౌండేషన్ బాధ్యులు

నారాయణఖేడ్: నారాయణఖేడ్ – కంగ్టి మార్గంలోని ఖేడ్ మండలం హుస్రానా(జి) గ్రామం వద్ద రోడ్డు దాటుతున్న వారిని అతివేగంగా రాకపోకలు సాగిస్తున్న వాహనాలు ఢీ కొంటూ తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గ్రామస్తులు ఈ విషయాన్ని ప్రవాసభారతీయుడైన జీఎం ఫౌండేషన్ చైర్మన్ గుర్రపుమశ్చందర్ దృష్టికి తీసుకెళ్లగా.. ప్రమాదాల నివారణకు ఆయన రెండు బారికెడ్లను తయారుచేసి శుక్రవారం వితరణ చేశారు. ఫౌండేషన్ బాధ్యులు పండరియాదవ్, సత్యపాల్‌రెడ్డి, జగతిరాజు, తుకారం, శ్రీనివాస్, సంతోష్ నాయక్ ఉన్నారు.

క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలి



క్రీడాపోటీలు ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి సూచించారు. నిజాంపేట్ మండల కేంద్రంలో ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. నిజాంపేట పాఠశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని హెచ్ఎం కోరడంతో నిజాంపేటకు చెందిన వ్యాపారి ఆత్మకూరి రాజు సేట్ రూ.50 వేలు, మాజీ ఎంపీపీ మల్లేశం రూ.10 వేలు విరాళంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. కార్యక్రమంలో నిజాంపేట మాజీ సర్పంచ్ జగన్‌చారి, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమేష్ చౌహాన్, మాజీ ఎంపీటీసీ సబితాలింగారెడ్డి, రాధాకృష్ణ, రాంసింగ్, శంకర్‌గౌడ్, మల్లేశం పాల్గొన్నారు.

ఉద్యోగులకు పదవీవిరమణ తప్పనిసరి

ఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రిలో సీహెచ్‌వోగా విధులు నిర్వర్తించి పదవీవిరమణ పొందిన వజ్రమణి, శ్రీనివాస్‌రెడ్డి దంపతులకు ఏర్పాటు చేసిన సన్మానసభలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఉద్యోగులకు పదవీవిరమణ తప్పనిసరి అని పేర్కొన్నారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ సంధ్యారాణి, సుధాకర్‌రెడ్డి, రాకేష్ షెట్కార్, సాగర్ షెట్కార్ పాల్గొన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

స్పెషల్ ఆఫీసర్ కాశీంబేగ్



గొడిచర్ల గ్రామంలో పర్యటించిన సంగారెడ్డి మండల స్పెషల్ ఆఫీసర్

సంగారెడ్డిటౌన్: గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంగారెడ్డి మండల స్పెషల్ ఆఫీసర్ కాశీంబేగ్ అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే సందర్భంగా గొడిచెర్ల తోపాటు పలు గ్రామాలలో పర్యటించి పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ముగిసిన స్కూల్ గేమ్స్

రాయికోడ్(అందోల్): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారంతో ముగిశాయి. అండర్ 14, అండర్ 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను నిర్వహించగా, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రతిభ కలిగిన జట్లను జిల్లా స్థాయి పోటీలకు పంపించనున్నట్లు ఎంఈఓ శ్రీనివాస్, హెచ్ఎం అంజయ్యలు తెలిపారు.





కలెక్టరేట్ ఆవరణం.. శునకాలకు ఆవాసం

సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఆవరణలో శునకాలు సంచరిస్తున్నాయి. ఇవి కార్యాలయంలో యథేచ్ఛగా తిరుగుతూ పనిచేసే అధికారులను, వివిధ పనుల నిమిత్తం వచ్చే జనాలను భయపెడుతున్నాయి. ప్రధాన గేట్ మెట్ల దగ్గర పడుకుంటున్నాయి. రాత్రి వేళ అధికారులు ఇంటికి వెళ్లే సమయంలో వారివెంట పడుతున్నాయి. కుక్కల బెడద కలెక్టరేట్‌లో కూడా తప్పడం లేదని పలువురు వాపోతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

సంగారెడ్డి టౌన్ : గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన సంగారెడ్డి మండలంలో చోటు చేసుకుంది. సంగారెడ్డి రూరల్ పోలీసుల కథనం మేరకు.. సదాశివనగర్ శివారులో ఓ వ్యక్తి భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తూ ఉండేవాడు. శుక్రవారం మృతి చెంది కనిపించడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడిపై తెలుపు రంగు చొక్కా, దోతి ఉందని ఎవరికైనా తెలిస్తే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు పేర్కొన్నారు.

హత్యనా.. ఆత్మహత్యనా?

జహీరాబాద్ టౌన్: వ్యవసాయ బావిలో మృతదేహం లభ్యమైన ఘటన జహీరాబాద్ మండలంలోని సత్వార్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల సమాచారంతో చిరాగ్‌పల్లి పోలీసులు సత్వార్ వెళ్లి పరిశీలించగా మృతుడు గ్రామానికి చెందిన మంగలి వీర్‌శెట్టిగా నిర్ధారించారు. మృతుదేహాన్ని బావినుంచి బయటకు తీయించారు. హత్యనా.. ఆత్మహత్యనా.. అనే కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు.

ద్విచక్రవాహనం దగ్ధం

పుల్‌కల్(అందోల్): ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై బైక్ కాలిబూడిదైంది. మండల పరిధిలోని కోడూరు గ్రామానికి చెందిన బిషం శ్రీనివాస్ ద్విచక్రవాహనంపై సంగారెడ్డి నుంచి ఇంటికి వస్తున్నాడు.ఈ క్రమంలో ఇసోజీపేట రహదారిపై బైక్ ఆగిపోయింది. బైక్ స్టార్టు చేసే క్రమంలో ఇంజన్‌లో మంటలు వ్యాపించి వాహనానికి వ్యాపించాయి. వాహనదారుడు మంటలు ఆర్పేలోపే పూర్తిగా కాలిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కాలిపోయిన బైక్

సంక్షిప్త వార్తలు

◆ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణానికి నూతనంగా మంజూరైన సబ్‌స్టేషన్ ఏర్పాటు కోసం శుక్రవారం అధికారులు స్థల పరిశీలన చేశారు. భారతినగర్ డివిజన్ పరిధిలోని బీడీఎల్ కాలనీ వెనుక ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏఈ సంజీవరావు, ఆర్ఐ శ్రీకాంత్, నాయకులు వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ 12వ బ్లాక్‌లో శుక్రవారం రూ. 30 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ పుష్ప శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో డ్రైనేజీ పైపులైన్ కారణంగా రోడ్డు పూర్తిగా గుంతలుగా మారిందని తెలిపారు.

◆ నేడు శనిత్రయోదశి పూజలు

పటాన్‌చెరుటౌన్: పటాన్‌చెరు పాత టోల్‌గేట్ సమీపంలోని రామలింగేశ్వర దేవస్థానం, జేపీ కాలనీలోని పంచముఖి హనుమాన్ దేవస్థానంలో శని త్రయోదశి సందర్భంగా శనివారం ఉదయం 5:30 గంటల నుంచి శనీశ్వర స్వామికి తైలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ అర్చకులు తెలిపారు.

◆ నేడు మండపాల నిర్వాహకులతో సమావేశం

పటాన్‌చెరుటౌన్: గణేష్ మండపాల నిర్వాహకుల సన్నాహక సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని సీఐ ప్రవీణ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని ముదిరాజ్ భవన్‌లో శనివారం సాయంత్రం 4 గంటలకు మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో వివిధశాఖల అధికారులు పాల్గొంటారని చెప్పారు.

◆ మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఆరుగురు వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు రూ. 2 వేల చొప్పున జరిమానా విధించారు. అలాగే మరొకరికి జరిమానాతో పాటు రెండు రోజుల జైలు శిక్ష విధించారు. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం, గురువారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురిని పట్టుకున్నట్లు చెప్పారు.

◆ రేపు పాదయాత్ర

జహీరాబాద్: లోక కల్యాణార్థం, విశ్వ శాంతి కోసం వీరశైవ లింగాయత్ సమాజ్, రాచన్న స్వామి భక్త బృందం ఆధ్వర్యంలో ఆదివారం పాదయాత్ర చేపడుతున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. జహీరాబాద్ పట్టణంలోని రాచన్నస్వామి ఆలయం నుంచి బడంపేటలోని రాచన్న స్వామి దేవాలయం వరకు పాద యాత్ర కొనసాగుతుందన్నారు. పాదయాత్రలో వీరశైవ లింగాయత్ సమాజ్, హరేకృష్ణ మూవ్‌మెంట్ బృందం సభ్యులు పాల్గొంటారన్నారు.

◆ వర్షంతో నిలిచిన కరెంట్ సరఫరా

మునిపల్లి(అందోల్): వర్షం పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంట్ లేదు. దీంతో ఉద్యోగులు, మహిళలు, చిన్నారులు ఇబ్బందులు పడ్డారు.

◆ పుల్‌కల్‌లో బీజేపీ సభ్యత్వం

పుల్‌కల్(అందోల్) : మండలంలో బీజేపీ సభ్యత్వాన్ని అత్యధికంగా నమోదు చేయాలని ఆ పార్టీ అధికార ప్రతినిధి సురేందర్ సూచించారు. పార్టీ సూచించిన సెల్ నంబర్‌కు మిస్‌డ్ కాల్ ఇచ్చి సభ్యత్వాన్ని నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పండరి, దత్తాత్రేయ, నర్సింహులు, మధు పాల్గొన్నారు.

◆ పెట్రోల్ దొంగ అరెస్టు

జోగిపేట (అందోల్): రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాల నుంచి పెట్రోల్‌ను ఎత్తుకెళ్తున్న దొంగను అరెస్టు చేసినట్లు జోగిపేట ఎస్ఐ పాండు తెలిపారు. పట్టణంలోని ఇందిరా నగర్‌లో నివాసముంటున్న శేకయ్య గౌడ్ తన ఇంటి ఎదుట పార్క్ చేసిన బైక్ నుంచి పెట్రోల్‌ను ఎత్తుకెళ్లారని ఫిర్యాదు చేశాడన్నారు. దీంతో పోలీసులు ఇంటి చుట్టు పక్కల గల సీసీ కెమెరాలు పరిశీలించగా ద్విచక్ర వాహనాల నుంచి పెట్రోల్‌ను దొంగలించిన దృశ్యాలు రికార్డయ్యాయని తెలిపారు. సీసీ కెమెరాల ఆధారంగా పట్టణానికి చెందిన ఊలవల పవన్‌ను విచారించి అరెస్టు చేసి, రిమాండ్‌కి తరలించినట్లు పాండు తెలిపారు.

◆ మట్కా జూదరుల అరెస్టు

జహీరాబాద్ టౌన్: పట్టణంలో మట్కా జూదం ఆడుతూ ఎండు గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని శుక్రవారం అరెస్టు చేశామని జహీరాబాద్ టౌన్ ఎస్ఐ. కాశీనాథ్ తెలిపారు. పట్టణానికి చెందిన ఎండీ ఖాజా పాష, గుర్రం శ్రీనివాస్, అక్రమ్, అర్షద్, ఎండీ శంషోద్దీన్, ముల్తానీలు సుభాష్ గంజ్ వ్యవసాయ మార్కెట్‌లో ఎండు గంజాయి విక్రయిస్తూ ఆన్‌లైన్‌లో మట్కా జూదం ఆడుతున్నారని చెప్పారు. నమ్మదిగిన సమాచారం మేరకు దాడిచేసి వారిని పట్టుకున్నామన్నారు. వారి నుంచి 2400 గ్రాముల గంజాయి, 11 సెల్‌ఫోన్లు, రూ. 2,410 నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

◆ అందరూ ఐక్యంగా ఉండాలి

న్యాల్‌కల్(జహీరాబాద్): కుల, మత భేదాలు లేకుండా అందరూ సోదర భావంతో కలిసి మెలిసి ఉండాలని తహసీల్దార్ భూపాల్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మిర్జాపూర్(ఎన్)లో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు గ్లాసుల పద్ధతి వంటి పద్ధతులకు స్వస్తి పలకాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజీరెడ్డి పాల్గొన్నారు.

అర్హులకు రుణమాఫీ : భిక్షపతి

జహీరాబాద్: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అవుతుందని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ భిక్షపతి తెలిపారు. శుక్రవారం మండలంలోని రంజోల్ గ్రామంలో రైతు రుణమాఫీ కోసం చేపట్టిన కుటుంబ నిర్ధారణ కార్యక్రమం చేపట్టారు. ఇందుకు సంబంధించి రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని మొగుడంపల్లి, జహీరాబాద్, కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో రెండు రోజులుగా రైతు రుణమాఫీ కుటుంబ సభ్యుల నిర్ధారణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు జహీరాబాద్ మండలంలో 1915 మంది లబ్దిదారుల్లో 175 కుటుంబాల నిర్ధారణ చేశామన్నారు. న్యాల్కల్ మండలంలో 1741కి గాను 255, ఝరాసంగం మండలంలో 531కి గాను 63, కోహీర్ మండలంలో 818 గాను 31, మొగుడంపల్లి మండలంలో 599 గాను 50 కుటుంబాలకు నిర్ధారణ చేయడం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో ఏఓ లావణ్య, ఏఈఓలు ప్రదీప్‌కుమార్, వీరేందర్, మనోహర్, రాజు, శ్రీనివాస్, అయేషా, ఖనిజ్ పాల్గొన్నారు.